# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 265 పేజీలు: 4 | వెల: రూ.4/- | శుక్రవారం 22 మే 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

# కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

## పోటెత్తిన భక్తులు

తొలి పుణ్యస్నానం ఆచరించిన కంచి పీఠాధిపతి, మంత్రులు

12 రోజుల పాటు కొనసాగనున్న పుష్కర వేడుకలు

గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల పవిత్ర త్రివేణి సంగమం ఇది

భక్తుల కోసం ప్రభుత్వం భారీ ఏర్పాట్లు



**భూపాలపల్లి మే 21 (నమస్తే ఉదయం)**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో సరస్వతీ అంత్య పుష్కరాలు ఈ రోజు ఉదయం వైభవంగా ప్రారంభమయ్యాయి. కంచి మఠం పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి తొలి పుణ్యస్నానం ఆచరించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిం చారు. ఉదయం 5:43 గంటలకు ఆయనతో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దంపతులు పవిత్ర స్నానం చేశారు. తెలంగాణలో తొలిసారిగా జరుగుతున్న ఈ పుష్కరాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే పవిత్ర త్రివేణి సంగమ క్షేత్రమే కాళేశ్వరం. దేశంలో ప్రయాగ్‌రాజ్ తర్వాత ఇలాంటి త్రివేణి సంగమం ఉన్న రెండో ప్రదేశం ఇదే. ఇక్కడ స్నానం ఆచరిస్తే పాపాలు తొలగిపోయి, పునర్జన్మ నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ 12 రోజుల పుష్కరాలకు తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 20 నుంచి 30 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పుష్కరాలను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా భద్రత, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా భక్తులు ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, దేవాదాయ శాఖ అధికారులు కూడా పాల్గొన్నారు.

## కనీస వేతనాలు భారీగా పెంచుతూ

# ప్రభుత్వం నిర్ణయం

## తెలంగాణలో కార్మికులకు గుడ్‌న్యూస్ చెప్పిన సీఎం



జూన్ 1 నుంచి అమల్లోకి పెంచిన వేతనాలు

రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించిన ప్రభుత్వం

జోన్-1కార్పొరేషన్లు, జోన్-2- మున్సిపాలిటీలు , జోన్-3 గ్రామీణం

**హైదరాబాద్, మే 21 (నమస్తే ఉదయం)**

రాష్ట్రంలో కార్మికుల కనీస వేతనాలను ప్రభుత్వం సవరించింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పెంచిన వేతనాలు అమల్లోకి రానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా కార్మికులను నాలుగు కేటగిరీలుగా విభజించి కనీస వేతనాలు పెంచారు. అన్‌స్కిల్డ్ కార్మికులకు 34.95శాతం సెమీ స్కిల్డ్ వారికి 32.01శాతం స్కిల్డ్ కార్మికులకు 25.90 శాతం వరకు పెరిగాయి. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 1.11కోట్ల మందికి ప్రయోజనం కలగనుంది.

జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా : రాష్ట్రంలో సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఎట్టకేలకు కార్మికులకు కనీస వేతనాలు పెరిగాయి. జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా కనీస వేతనాలను ప్రభుత్వం సవరించింది. రాష్ట్రంలో 9 లక్షల 37 వేల 455 సంస్థల్లో కోటీ 11 లక్షల 56 వేల 204 మంది కార్మికులకు వేతన సవరణ ద్వారా లబ్ధి చేకూరుతుంది. రాష్ట్రంలో నైపుణ్యం లేని కార్మికులు 74 లక్షల 97 వేల 420 మంది పాక్షిక నైపుణ్యం ఉన్న వారు 20 లక్షల 94 వేల 455 మంది నైపుణ్యం గల కార్మికులు 15 లక్షల 64,329 మంది ఉన్నారు. కనీస వేతనాల చట్టం-1948 ప్రకారం రాష్ట్రంలో వివిధ రంగాలలో పనిచేసే కార్మికులకు కనీస జీవన ప్రమాణాలను, సామాజిక భద్రతను నిర్ధారించడానికి కనీస వేతనాలను నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది.

రాష్ట్రంలో 73 రకాల ఉపాధి రంగాలను గుర్తించి ఉపాధివారీగా కనీస వేతనాలను ప్రభుత్వం నోటిఫై చేసింది. నిబంధనల ప్రకారం సాధారణంగా ప్రతీ 5 సంవత్సరాలకు ఒకసారి ఈ వేతనాలను సవరించాలి. అయితే రాష్ట్రంలో సుమారు పన్నెండు సంవత్సరాలుగా కనీస వేతనాల సమగ్ర సవరణ ప్రక్రియ జరగలేదు. సుదీర్ఘ జాప్యం వల్ల కనీస వేతనాలకు ప్రస్తుత ..మిగతా 2లో

# కంటైనర్‌లో మంటలు

## కాలి బూడిదైన 8 కొత్త కార్లు

ఎండలు మండిపోతున్న వేళ పెరుగుతున్న అగ్నిప్రమాదాలు

మెదక్ జిల్లా తూప్రాన్ శివారులో కంటైనర్‌లో చెలరేగిన మంటలు

**హైదరాబాద్, మే 21 (నమస్తే ఉదయం)**



అసలే వేసవి కాలం. వీటికి తోడు అగ్ని ప్రమాద ఘటనలు. ఎప్పుడు, ఎక్కడ నిప్పు రాజుకుంటుందో తెలియని పరిస్థితి. ఉన్నట్టుండి మంటలు చెలరేగి, భారీగా ఆస్తి నష్టం వాటిల్లుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టమూ సంభవిస్తోంది. హైదరాబాద్‌లో ఇటీవల కాలంలో జరుగుతున్న వరుస ఘటనలే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. మెదక్ జిల్లా తూప్రాన్ శివారులో కంటైనర్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో అందులో ఉన్న 8 కొత్త కార్లు దగ్ధమయ్యాయి.

## బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు

# హైకోర్టు అనుమతి

**హైదరాబాద్, మే 21 (నమస్తే ఉదయం)**



బండి భగీరథ్ ధాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి హైకోర్టు అనుమతించింది. ఈ మేరకు భగీరథ్ తరపు న్యాయవాది చేసిన విజ్ఞప్తిని హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఓ మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని పేట్ బషీరాబాద్ పీఎస్‌లో ఈ నెల 8వ తేదీన బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ బండి భగీరథ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై 15వ తేదీన హైకోర్టు సుదీర్ఘ వాదనలు వింది. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ నెల 16వ తేదీన భగీరథ్‌ను ..మిగతా 2లో

# నిప్పులు కురిపిస్తున్న భానుడు

తెలంగాణ 46.5, ఏపీలో 48 డిగ్రీల ఉష్ణోగ్రతలు

అధిక ఉష్ణోగ్రతలతో నిప్పుల కుంపటిలా తెలుగు రాష్ట్రాలు

పెద్దపల్లి జిల్లాలో 46.5 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

20 జిల్లాల్లో 46 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్, మే 21 (నమస్తే ఉదయం)**

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో రోజువారీ ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. దీంతో ఎండ వేడిమికి తాళలేక ప్రజలు అల్లాడుతున్నారు. తెలంగాణలో అత్యధికంగా పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5 డిగ్రీలు, సూర్యాపేట జిల్లాలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యింది.





2

## ఎన్నాళ్లీ మొద్దు నిద్ర!

పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ రేవంత్ కు కేటీఆర్ లేఖ

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారన్న కేటీఆర్

10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన

గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచి డిపాజిట్ వసూలు చేస్తున్నారని మండిపాటు

రైతు ద్రోహిగా రేవంత్ మిగిలిపోతారని వ్యాఖ్య

## తమిళనాడు చరిత్రలో ఇదొక

# టర్నింగ్ పాయింట్

క్యాబినెట్ బెర్తులు దక్కడంపై కాంగ్రెస్

తమిళనాడు ప్రభుత్వం క్యాబినెట్ విస్తరణ

కాంగ్రెస్ నుంచి ఇద్దరికి అవకాశం

తమ పార్టీ నేతలు అధికారం కోసం విశ్వాసం, అంకితభావంతో గత 59 ఏళ్లుగా పనిచేస్తున్నారన్న హస్తం పార్టీ




**న్యూఢిల్లీ, మే 21 (నమస్తే ఉదయం)**

గత 59 ఏళ్లుగా విశ్వాసంతో పనిచేస్తున్న హస్తం పార్టీ కార్యకర్తలకు జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కడం ఒక వరంగా అభివర్ణించింది కాంగ్రెస్. అధికారం కోసం విశ్వాసంతో, అంకితభావంతో ఇన్నాళ్లుగా కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడుతున్నారని పేర్కొంది. ఇప్పుడు వారికి అధికారం దక్కిందని వెల్లడించింది. తమిళనాడు రాజకీయ చరిత్రలో దీన్నొక మలుపుగా అభివర్ణించింది. విజయ్ క్యాబినెట్‌లో తమ పార్టీకి చెందిన ఇద్దరికి మంత్రి పదవుల దక్కిన నేపథ్యంలో తమిళనాడు, పుదుచ్చేరి ఏఐసీసీ ఇన్‌చార్జ్ గిరీశ్ చోడంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. "తమిళనాడు ప్రజల తీర్పు సంకీర్ణ ప్రభుత్వానికి ఉన్న మద్దతును స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. అధికారంలో వాటా కోసం మా కార్యకర్తలు పోరాడుతున్నారు. ఈ రోజు కాంగ్రెస్ కార్యకర్తలకు అధికారం దక్కింది. తమిళ ప్రజలు లౌకిక, ప్రగతిశీల ప్రభుత్వాన్ని కోరుకున్నారు" అని గిరీశ్ చోడంకర్ పేర్కొన్నారు.

# కమిషన్ కక్కుర్తి.. కటకటాల వెనక్కి!

**సైబరాబాద్ పోలీసుల చేతికి చిక్కిన 'మ్యూల్ అకౌంట్ల' ముఠా సభ్యుడు**

**రాపిడో డెలివరీ బాయ్ అవతారంలో అంతర్జాతీయ సైబర్ నెట్‌వర్క్**

**33 బ్యాంక్ బుక్కులు, రూ. 1.02 లక్షల నగదు, ఫోన్లు సీజ్**

**ఖాతాలు అద్దెకిస్తే జైలు శిక్ష తప్పదని సైబర్ క్రైం పోలీసుల హెచ్చరిక**

**శేరిలింగంపల్లి : మే 21, (నమస్తే ఉదయం)**

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ కమిషన్ల కక్కుర్తి ఒక డెలివరీ బాయ్‌ను అంతర్జాతీయ సైబర్ నేరగాళ్ల ముఠాలో కీలక భాగస్వామిని చేసింది. అమాయకులను ముంచి దోచుకున్న కోట్లాది రూపాయల సైబర్ సొమ్మును చేతులు మార్చేందుకు 'మ్యూల్ బ్యాంక్ అకౌంట్లను' సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర ముఠా గుట్టును సైబరాబాద్ సైబర్ క్రైమ్, ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా రట్టు చేశారు. ఈ కేసులో ఒక కీలక నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి భారీగా బ్యాంక్ పత్రాలు, మొబైల్ ఫోన్లు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు సైబర్ క్రైం డీసీపీ సాయి మనోహర్, క్రైం డీసీపీ శోభన్ కుమార్ వెల్లడించారు. సైబరాబాద్ కమీషనరేట్ లో ఏర్పాటు చెసిన విలేకరుల సమావేశంలో వివరించారు.

పోలీసుల కథనం ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన దిలీప్ సింగ్ (27) కూకట్‌పల్లి లోని అపురూప కాలనీలో నివసిస్తూ రాపిడో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. 2024లో ఇన్‌స్టాగ్రామ్‌లో వచ్చిన కొన్ని 'ఈజీ మనీ' ప్రకటనల ద్వారా అతనికి "జోర్డాన్" పింటూ భయ్యా అనే అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లతో పరిచయం ఏర్పడింది.



విలేకరుల సమావేశం నిందితుని వివరాలు వెల్లడిస్తున్న సైబర్ క్రైం డీసీపీ సాయి మనోహర్, క్రైం డీసీపీ శోభన్ కుమార్ ఇతర అధికారులు



నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న నగదు ఇతర పరికరాలు..

బ్యాంక్ అకౌంట్లు సమకూర్చితే భారీగా కమిషన్ ఇస్తామని వారు దిలీప్‌కు ఎర వేశారు. ఒక సేవింగ్స్ అకౌంట్‌కు రూ. 25,000, కరెంట్ అకౌంట్‌కు రూ. 50,000 ఇస్తామని ఆశ చూపారు. ఈ అకౌంట్లను డిజిటల్ అరెస్ట్, ట్రేడింగ్ ఫ్రాడ్, ఆన్‌లైన్ గేమింగ్ వంటి దారుణమైన సైబర్ నేరాల కోసం వాడుతారని తెలిసినా కేవలం డబ్బు పిచ్చితో దిలీప్ సింగ్ ఇందుకు అంగీకరించాడు. తన ఖాతాలతో పాటు ఇతరుల నుంచి సేకరించిన ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులు, పాస్‌బుక్స్, చెక్‌బుక్స్‌ను సేకరించి ఆ ముఠాకు అప్పగించడం ప్రారంభించాడు.

**బ్యాంక్ ఉద్యోగుల హస్తం?**

ఈ దందా కేవలం దిలీప్ సింగ్ ఒక్కడితోనే ఆగలేదు. నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి పక్కా వెరిఫికేషన్ లేకుండా అకౌంట్లు తెరిపించడంలో కొంతమంది బ్యాంక్ ఉద్యోగుల పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. నిందితుడితో చేతులు కలిపిన సదరు ఉద్యోగుల గురించిన సమాచారాన్ని సేకరిస్తూ, ఈ కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు.

**అర్ధరాత్రి దాడి.. సొత్తు సీజ్**

విశ్వసనీయ సమాచారంతో గురువారం తెల్లవారుజామున 4 గంటలకు పోలీసులు నిందితుడి స్థావరంపై దాడి చేసి నిందితుడైన దిలీప్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి రూ. 1,02,000 నగదు, 3 స్మార్ట్‌ఫోన్లు12 డెబిట్ కార్డులు,1 క్రెడిట్ కార్డు 3 బ్యాంక్ పాస్‌బుక్స్, 7 చెక్ బుక్స్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రాలకు కొరియర్ చేయడానికి సిద్ధంగా ఉంచిన 33 బ్యాంక్ పాస్‌బుక్స్ స్వాధీనం చేసుకోన్నారు. సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ, టి. సాయిమనోహర్, ఎస్ఓటీ డిసిపి శోభన్ కుమార్ ప్రజలను హెచ్చరిస్తూ పలు సూచనలు చేశారు: విద్యార్థులు, నిరుద్యోగులు, డెలివరీ బాయ్స్ సోషల్ మీడియాలో వచ్చే 'ఈజీ మనీ' ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు. బ్యాంక్ అకౌంట్లను, క్రిప్టో వాలెట్లను ఇతరులకు వాడటానికి ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏటీఎం కార్డులు, ఓటీపీలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్‌లు, కేవైసీ పత్రాలు ఎవరికీ షేర్ చేయవద్దన్నారు.

మీ ఖాతాలో మీ ప్రమేయం లేకుండా అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వెంటనే బ్యాంక్ అధికారులకు లతోపాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్ సీసీఆర్) సమాచారం అందించాలి.

# కనీస వేతనాలు భారీగా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి...**

మార్కెట్ లోని వాస్తవ ఆర్థిక పరిస్థితులకు, ద్రవ్యోల్బణానికి, పెరిగిన జీవన వ్యయానికి మధ్య భారీ తేడా ఏర్పడింది. పొరుగు రాష్ట్రాలు, ఇతర సమాన రంగాల్లో అమల్లో ఉన్న వేతనాలతో తెలంగాణలో వేతనాలు చాలా వెనుకబడ్డాయి.

కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం : వేతన సవరణలో ఆలస్యాన్ని సవాలు చేస్తూ కార్మిక సంఘాలు హైకోర్టును కూడా ఆశ్రయించాయి. కనీస వేతనాలు సవరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో గతేడాది జూన్ 27న కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. కార్మికుల సంక్షేమాన్ని పరిశ్రమల పోటీతత్వం, ఉపాధి కల్పన, రాష్ట్ర ఆర్థిక వృద్ధిని పరిగణలోకి తీసుకొని వేతన సవరణ చేసేందుకు క్యాబినెట్ సబ్ కమిటీ కసరత్తు చేసింది. వేతన సవరణలో జాప్యం, కార్మికులు, ట్రేడ్ యూనియన్లు, పరిశ్రమల నుండి వచ్చిన డిమాండ్లు, వినతులు, పొరుగు రాష్ట్రాలలో ప్రస్తుతం అమలులో ఉన్న వేతనాలను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించింది. పెరిగిన ద్రవ్యోల్బణం, జీవన వ్యయ పరిస్థితులు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు, కొత్త చట్టం వల్ల వచ్చే న్యాయపరమైన అంశాలను కూడా అధ్యయనం చేసింది.

"ఏఐతో కోట్లాది ఉద్యోగాలకు ముప్పు వస్తోంది. జర్మనీ, జపాన్, సింగపూర్‌లో ఎన్నో ఉద్యోగాలు ఉన్నాయి. రాష్ట్ర యువత స్కిల్స్ పెంచుకొని విదేశీ ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు ఉన్నవారు కావాలని విదేశాలు మమ్మల్ని సంప్రదిస్తున్నాయి. స్కిల్స్ పెంచుకునేందుకు అవసరమైన ప్రోత్సాహకాలను ఇస్తున్నాం. ఏఐ వచ్చినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ముప్పు ఉండదు. నైపుణ్యాలు పెంచుకుంటే విదేశాల్లో రూ.2 లక్షల వరకు వేతనం ఉంటుంది. నైపుణ్యాలు పెంచేందుకు ఏటీసీ విద్యార్థులకు నెలకు రూ.2 వేలు ఇస్తున్నాం"- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

పెరిగిన వేతనాలు ఇలా : మారిన పరిస్థితులు, కనీస వేతనాల సలహా బోర్డు సిఫార్సులు, ప్రస్తుత ఆర్థిక స్థితిగతులు, పరిశ్రమల మనుగడను దృష్టిలో ఉంచుకుని కమిటీ కీలక సిఫార్సులు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాలకు ఏకరూపత ఉండేలా, నూతన వేతన కోడ్-2019 లక్ష్యాలకు అనుగుణంగా వేతన నిర్మాణాన్ని సూచించింది. కార్పొరేషన్లను జోన్ వన్‌గా మున్సిపాల్టీలను జోన్ 2 గ్రామీణ ప్రాంతాలను జోన్ 3గా విభజించింది. కార్మికులను అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్ కేటగిరీలుగా విభజించింది.

అన్‌స్కిల్డ్ కార్మికులకు కనీస వేతనాన్ని జోన్ 1లో 14వేల రూపాయలు, జోన్ 2లో 15వేలు, జోన్ 3లో 16వేల రూపాయలుగా నిర్ణయించారు. సెమీ స్కిల్డ్ కార్మికులకు జోన్ 1లో 15వేల రూపాయలు, జోన్ 2లో 16వేలు, జోన్ 3లో 17వేల రూపాయలు కనీస వేతనంగా ఖరారు చేశారు. స్కిల్డ్ కార్మికులకు జోన్ వన్‌లో 16వేల 500, జోన్ టూలో 17 వేల 500, జోన్ 3లో 18 వేల 500 రూపాయలుగా ప్రకటించారు. హైలీ స్కిల్డ్ కార్మికులకు జోన్ 1లో 18వేలు, జోన్ 2లో 19వేలు, జోన్ 3లో 20వేల రూపాయల కనీస వేతనాన్ని ఖరారు చేశారు. తక్కువ వేతనం ఉన్న కార్మికులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అన్‌స్కిల్డ్ కార్మికులకు అత్యధికంగా 34.95 శాతం, సెమీ-స్కిల్డ్ కేటగిరీలో 32.01 శాతం స్కిల్డ్ వర్కర్లకు 25.90 వరకు వేతనాలు పెరగనున్నాయి. జూన్ 1 నుంచి సవరించిన వేతనాలను పరిశ్రమలు అమలు చేసేలా కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

# నిప్పులు కురిపిస్తున్న భానుడు

**మొదటి పేజీ తరువాయి...**

కొద్ది రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చంచుపల్లిలో 46.4 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లుగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. మరిన్ని జిల్లాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు : వరంగల్ జిల్లా 46.2 డిగ్రీలు, సిద్దిపేట 46.1, కామారెడ్డి 45.9, జనగామ 45.5, మెదక్ 45.1, నాగర్‌కర్నూలు 44.9, రంగారెడ్డి 44.9, సంగారెడ్డి 44.1, మేడ్చల్ 43.9, మహబూబ్‌నగర్ 43.6, హైదరాబాద్ 43.4, గద్వాల 43.3, వికారాబాద్ 43.1, వనపర్తి 42.8, నారాయణపేట 42.4

ఏపీలో ఉష్ణోగ్రతలు : ఆంధ్రప్రదేశ్‌లోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లాలోని అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లాలోని అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. ఇరవై జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఉష్ణ తీవ్రత కొనసాగనుందని అధికారులు వెల్లడించారు.

# బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌కు హైకోర్టు అనుమతి

**మొదటి పేజీ తరువాయి...**

పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో ముందస్తు బెయిల్ పిటిషన్ నిరర్థకంగా మారింది. ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకునేలా బండి భగీరథ్ తరపు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేశారు. బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంతో ముందస్తు బెయిల్ పిటిషన్ ఉపసంహరించుకుంటున్నట్లు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. దీంతో ఉపసంహరణకు అనుమతించిన హైకోర్టు, బండి భగీరథ్ రెగ్యులర్ బెయిల్ వేసుకోవడానికి అనుమతించింది.

# ఎన్నాళ్లీ మొద్దు నిద్ర!

**హైదరాబాద్, మే 21 (నమస్తే ఉదయం)**

తెలంగాణలో ప్రస్తుతం పంట కొనుగోళ్ల సంక్షోభం నెలకొందంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న కష్టాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా ఎంతకాలం మొద్దునిద్ర పోతారని ప్రశ్నిస్తూ ఆయనకు ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ నెల 23న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలోనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి, అన్నదాతల సమస్యలపై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కొండంత ధైర్యంతో బతికిన సాగు రంగాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం కొద్ది నెలల్లోనే కన్నీటి సేద్యంగా మార్చేసిందని ఆయన ఆరోపించారు.



# గ్రామ పంచాయతీ కార్మికుడు ఆత్మహత్య యత్నం

**గ్రామ పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే21(నమస్తే ఉదయం):**

గత కొన్ని నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో మనస్తాపానికి చెందిన ఓ మల్టిపర్పస్ వర్కర్ పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కేటిదొడ్డి మండలం కొండాపురం మల్టి ఫర్పస్ వర్కర్ గా పని చేస్తున్న రాజు అనే కార్మికుడికి గత కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఇటీవల జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులకు ఫిర్యాదు చేశారన్నా నెపంతో రాజును విధుల నుంచి తొలగింవారు. దీంతో మనస్తాపం చెందిన రాజు ఆదివారం రాత్రి పురుగుల మందు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు తెలిసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం గద్వాల ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రాజు ఆరోగ్యం నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

**గ్రామ పంచాయతీ తీర్మాణం మేరకు తొలగింపు**

పారిశుధ్య కార్మికుడు రాజును తొలగించడానికి ఈనెల 12న జరిగిన గ్రామ సమావేశంలో తీర్మాణం చేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి శంషాద్ వెల్లడించారు.

**సెక్రటరీ తీరుపై జిల్లా అధికారులకు ఫిర్యాదు**

కొండాపురం గ్రామపంచాయతీలో మల్టిపర్పస్ వర్కర్ గా పనిచేస్తున్న రాజుకు గత కొంత కొన్ని నెలలుగా జీతాలు చెల్లించలేదు. ఈనెల 12న గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామాభివృద్ధి అంశాలు పొందుపరిచి అందరు తీర్మాణించడం జరిగింది. కాని వార్డు మెంబర్లకు తెలియకుండా కార్మికుడు రాజును విధుల నుంచి తొలగించాలనే అంశం ఎజెండాలో తీర్మాణించ లేదని వార్డు మెంబర్లు ఆరోపించారు. ఎజెండాలో మాకు తెలియకుండా కొన్న అంశాలు పొందుపరిచిన గ్రామ పంచాయతీ కార్యదర్శి పై విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు జిల్లా డిపీఓకు వినతి పత్రం అందజేసినట్లు వార్డు మెంబర్లు తెలిపారు. గ్రామ సర్పంచ్, గ్రామ పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగం ఉండాలి: వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 21(నమస్తే ఉదయం)**

భూసార పరీక్షల ఆధారంగానే రైతులు తమ పొలాల్లో ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్ రెడ్డి సూచించారు

గురువారం నందిన్నె గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నార్మ్, మరియు ఐఎఫ్ఎఫ్సీవో సంస్థల సహకారంతో రైతు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, నేల పరీక్షల ప్రాముఖ్యత, నేల పరీక్ష ప్రదర్శన, బయో ఫెర్టిలైజర్ల వినియోగం, నానో ఎరువులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నార్మ్ శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకట కుమార్, డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ మురళీ కృష్ణ రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువుల వినియోగంపై వివరించారు. ఐఎఫ్ఎఫ్ సిఓ మేనేజర్ రాజు నానో ఎరువుల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేష్, ఉప సర్పంచ్ తాయ్ రెడ్డి, రైతులు , అధికారులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ దేశం కోసం చేసిన సేవలు మరువలేనివి

**ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది రాజీవ్ గాంధీనే**

**పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగానే కాంగ్రెస్ పార్టీ ముందుకెళ్తుంది:టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్**

**కూకట్ పల్లి, మే 21 (నమస్తే ఉదయం)**



దివంగత మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని కూకట్ పల్లి నియోజకవర్గంలో పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కెపిహెచ్బి కాలనీ మలేషియా టౌన్షిప్ సర్కిల్లోను, బాలానగర్ చౌరస్తాలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి రమేష్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ చేసిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలో ముందుగా సంస్కరణల రంగంలో, ఐటి సెక్టార్లో విప్లవాత్మక మార్పులు చేపట్టింది రాజీవ్ గాంధీ అని అన్నారు. నాడు ఆయన చేపట్టిన సంస్కరణల కారణంగానే దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోయిందని అన్నారు. పేద ప్రజల అభివృద్ధి లక్ష్యంగానే కాంగ్రెస్ పాలన కొనసాగేదన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే ప్రభుత్వ ఏర్పడుతుందన్నారు. ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కార్యకర్తలు గట్టిగా కృషి చేయాలని రమేష్ ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్, డివిజన్ అధ్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవ్ దళ్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ పోస్టు ముందే అక్రమ మద్యం సిట్టింగులు

**నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్, పోలీస్ శాఖలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 21(నమస్తే ఉదయం):**

తెలంగాణ-కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన నందిన్నె వద్ద ఉన్న అంతరాష్ట్ర చెక్ పోస్టు వద్ద అక్రమ మద్య రవాణాను అడ్డుకోవడానికి సివిల్ పోలీస్, ఎక్సైజ్ శాఖలు ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. తనిఖీలు నిర్వహించాల్సిన అధికారుల కళ్ల ముందే, చెక్ పోస్టుకు సరిగ్గా ఎదురుగా ఉన్న దాబాల్లో యథేచ్ఛగా అక్రమ మద్యం విక్రయాలు, సిట్టింగులు మండల ప్రజలు మండిపడుతున్నారు.

**నిబంధనలు బేఖాతరు -- పట్టపగలే మద్యం సిట్టింగులు**

దాబాల్లో లిక్కర్ విక్రయించడం, తాగడానికి సిట్టింగులు ఏర్పాటు చేయడంపై చట్టపరంగా పూర్తి నిషేధం ఉంది. గతంలో ఎవరైనా గుట్టుచప్పుడు కాకుండా ఇలాంటి పనులకు పాల్పడేవారు. కానీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. నందిన్నె సరిహద్దు దాబాల్లో ఎటువంటి అనుమతులు లేకుండానే మద్యం తాగేందుకు నిర్వాహకులు సిట్టింగ్ ఏర్పాటు చేయడం మండల ప్రజలు మండిపడుతున్నారు.

**మామూళ్ల మత్తులో అధికారులు?**

అక్రమాలను అరికట్టాల్సిన బాధ్యత కలిగిన ఎక్సైజ్, పోలీస్ శాఖల అధికారులు.. దాబా నిర్వాహకులు అందజేసే "మామూళ్లకు" అలవాటుపడిపోయారనే అనుమానాలువ్యక్తమవుతున్నాయి. కళ్ల ముందే దాబాల్లో




సిట్టింగ్ లు ఏర్పాటు సాగుతున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విల్సిల్లుతోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.తక్షణ చర్యలకు డిమాండ్:

సరిహద్దు చెక్ పోస్టుల వద్ద తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నందిన్నె చెక్ పోస్టు ఎదురుగా అక్రమంగా సిట్టింగులు నిర్వహిస్తున్న దాబాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై విచారణ జరిపించాలని కోరుతున్నారు.

# ఘనంగా రెవరెండ్ చెవాకుల జాన్ మోజెస్ జన్మదిన వేడుకలు

## సంఘ సభ్యులు, బంధువులు, కుటుంబం తో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్న రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్


రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ దంపతులతో రాజేంద్రనగర్ మన్నా చర్చ్ సభ్యులు


పాస్టర్ గారి కుటుంబంతో యువ్వనస్థులు


మాట్లాడుతున్న రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్

**బుద్వేల్, మే 21 (నమస్తే ఉదయం)**

35 సంవత్సరాలుగా యేసయ్య సేవలో ఉన్న రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ గురువారం తన పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మన్నా చర్చ్ లో కుటుంబ సభ్యులు, బంధువులు, సంఘ సభ్యుల సమక్షంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ వేడుకలకు సిస్టర్ శాంతి అధ్యక్షత వహించారు. బ్రదర్ జోబ్ బైబిల్ సందేశాలను అందచేశారు. రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ సతీమణి సీహెచ్ ప్రభావతి పాస్టరమ్మ, చెల్లెళ్ళు విజయ పాస్టరమ్మ, కృపాకుమారి పాస్టరమ్మ, బావ పాస్టర్ జాన్ వెస్లీ, అల్లుళ్ళు డానీ ప్రేమ్ సన్, హోలీ, కోడలు జెమిమా లతో కలిసి కేక్ కట్ చేశారు. పాస్టర్ గారికి శుభాలు తెలియచేశారు. సంఘ సంఘ సభ్యులు సిస్టర్ సుజాత, బ్రదర్ డి సాయిలు, బ్రదర్ ఎ డానియల్, బ్రదర్ ఫ్రాంక్లిన్ లు గ్రీటింగ్స్ తెలియచేశారు. సిస్టర్ ఎ మాధవి డానియల్, బ్రదర్ జాన్ లు ప్రార్ధనలు చేశారు.

**పాస్టర్స్ ఫెలోషిప్ తరపున....**

రాజేంద్రనగర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ తరపున కోశాధికారి పాస్టర్ బట్టు శ్రీకాంత్, కమిటీ సభ్యులు పాస్టర్ గుంటి డానియల్ లు కేక్ కట్ చేయించి గ్రీటింగ్స్ తెలియచేశారు. పాస్టర్ గారిని సన్మానించారు.

సిస్టర్ సుస్మిత, మాస్టర్ లేవీ ప్రత్యేక పాట పాడారు. సిస్టర్ విజయ ప్రేమానందం, సిస్టర్ కృపాకుమారి జాన్ వెస్లీ, జెమిమా లు, బ్రదర్ శశిధర్ ఆధ్వర్యంలో ఆరాధన గీతాలు ఆలపించారు. జన్మదిన వేడుకలలో అమలాపురం కు చెందిన మోజెస్ లు పాల్గొన్నారు.

**అమెరికా నుంచి కేక్ పంపించిన కుమారులు**

రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ జన్మదినం సందర్భంగా అమెరికా లో ఉంటున్న ఆయన కుమారులు జాన్ సామ్యూల్, జాన్ సుందర్ పాల్ లు కేక్ పంపించారు.


రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ కు
జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కుటుంబ సభ్యులు


పాస్టర్ గారిని, పాస్టరమ్మ గారిని సన్మానిస్తున్న అప్పారెడ్డి గూడెం కుటుంబ సభ్యులు


రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ తో కేక్ కట్ చేయిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు


రెవరెండ్ సీ హెచ్ జాన్ మోజెస్ కు కేక్ తినిపిస్తున్న పాస్టరమ్మ సీహెచ్ ప్రభావతి



# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్
## రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్,మే21(నమస్తే ఉదయం)**

ఎస్ఐఆర్ అనేది అసలైన ఓటర్ల గుర్తింపు కోసం ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర ఎస్ఐఆర్ సహ ఇంచార్జ్ పొన్న వెంకటరమణ,రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఓటర్ జాబితాను సరిచేసే ప్రత్యేక తనిఖీ కార్యక్రమమని,దీని వల్ల సరైన ఓటర్లకు మాత్రమే ఓటు హక్కు ఉండేలా చేస్తుందన్నారు.ఎస్ఐఆర్ వల్ల ప్రయోజనాలు సరైన ఓటర్లకు మాత్రమే ఓటు హక్కు ఫేక్ ఓట్లు తగ్గుతాయన్నారు.ఎన్నికలు న్యాయంగా జరుగుతాయన్నారు.ప్రజాస్వామ్యం బలపడుతుందని వివరించారు.ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని,ప్రతి బస్తీలు,కాలనీలలో దీనిపై అవగాహన కల్పిస్తూ ప్రక్రియ ప్రారంభించాలని,అదేవిధంగా దీనికి సంబంధించిన పలు సూచనలు సలహాలు వివరించారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి,రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నేమోని మల్లేష్ యాదవ్,రావుల భాస్కర్, సంతోష్ గౌడ్,శ్రీకాంత్ రెడ్డి,నవారు మురలీధర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి,బి.నర్సింహ,మజర్,ప్రభుదాస్,కొవ్వకుల బాబు,రామారావు, శేఖర్,ఎన్ను శంకర్ రెడ్డి,జీ.శంకర్,కుర్మయ్య, యాదగిరి,రాంబాబు,రాజు, స్వామి, భూషణ్,మధుసూదన్,పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన రాజేంద్రనగర్ బిజెపి నాయకులు

**రాజేంద్రనగర్,మే21(నమస్తే ఉదయం)**

రాజేంద్రనగర్ లోని ఐసీఐఆర్ కేంద్ర వ్యవసాయశాఖ సంబంధించిన మిల్లెట్స్ పరిశోధన కేంద్రానికి కేంద్ర వ్యవసాయ,గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరయ్యారు.ఆయనకు రాజేంద్రనగర్ స్థానిక బీజేపీ నాయకులను గోల్కొండ గోషామహల్ జిల్లా ప్రబారి వై.శ్రీధర్,జి.బాబురావు,బీ.ధీరజ్ యాదవ్,పి.రవీందర్ తదితరులు కలిసిసన్మానించారు.అందులో భాగంగా కేంద్ర మంత్రి మొక్కలు నాటి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



# కేంద్రం ఎక్సైజ్, సుంకాలు సెస్సుల పేరుతో ప్రజలను దోచుకుంటుంది

## కేంద్ర ప్రభుత్వం పెంచుతున్నపెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్యుడి నడ్డి విరుగుతుంది

## కార్పోరేట్ శక్తులకు కోట్ల రూపాయల ప్రజాధనం ధారాదత్తం చేస్తూ ప్రజలపై భారం మోపుతున్న మోడీ

## పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

**కూకట్ పల్లి, మే 21 (నమస్తే ఉదయం)**



ఎన్నికలు ముగిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపిందని కేంద్ర ప్రభుత్వ వైఖరిపై గాంధీ భవన్ లో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం విలేకరుల సమావేశంలో విమర్శించారు. యూపీఏ హయాంలో అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజలపై భారాలు వేయలేదని గుర్తుచేశారు. ముడి చమురు ధరలు తగ్గిన కేంద్రం ఎక్సైజ్, సుంకాలు సెస్సుల పేరుతో ప్రజలను దోచుకుంటోందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోడీ ' డబులింజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాలలో పాలన అద్భుతం, అమోఘం యావత్ దేశ అభివృద్ధి వికసిత్ భారత్ వైపు దూసు కెళ్తుంది. రాష్ట్రాల పాలనలో అన్ని రంగాల్లో ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైందని ' ఊదరగొట్టిన ప్రసంగాలకు, మీడియా కల్పించిన విస్తృత ప్రచారం చూసి ప్రజలు నిజంగానే నమ్మారనిపిస్తోంది. ఆయా రాష్ట్రాలలో అన్ని వ్యవస్థలు ధ్వంసమయ్యాయని బీజేపీ పాలిత రాష్ట్రాలలో, కేంద్రంలో అన్ని రంగాల్లో పరుగులు పెడుతూ ఆర్థిక వ్యవస్థ స్వర్ణయగంలో నడుస్తుందని మోడీ భజనపరులు కీర్తిస్తున్నారు అని అన్నారు. ఇదంతా చూసి ప్రజలు ఓట్లను వేసి గెలిపిస్తే వారం తిరగకముందే దేశమంతటా తిరుగుతూ దేశం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నది ప్రజలు దేశ భక్తిని చాటుకోవాలంటూ ఉచిత పొదుపు సూత్రాలను వల్లెవేస్తూ, ప్రజలు దుబారా ఖర్చును తగ్గించుకోవాలని కర్తవ్య బోధన చేసారని అని అన్నారు. దేశ ఆర్థిక క్లిష్ట పరిస్థితుల నుంచి గట్టెక్కించే తన కర్తవ్యాన్ని, తన దుబారా ఖర్చులను తగ్గించుకోవడం మర్చిపోయి ఈ ఆర్థిక సంక్షోభ భారాన్ని దేశభక్తితో సామాన్య ప్రజలు భరించాలని చేతులు దులుపుకోవడం తన పన్నెండేండ్ల పాలన పతనావస్థ స్థితికి చేరిందని చెప్పున్నట్లే. ఇప్పటికే రూపాయి విలువ రికార్డు స్థాయిలో డాలర్ ఏ రూ. 96.90 వారం నుంచి బ్రేక్ లేకుండా పడుతున్న రూపాయి దిగజారి వందకు చేరువలో పతనా స్థితికి వెళ్తుంది. డాలర్ తో పోటీపడి ప్రపంచ ఆర్థిక రంగంలో అగ్రగామి దేశంగా ఎలా నిలుస్తుంది? 500 ట్రిలియన్ డాలర్లకు ఎప్పుడు చేరువవుతుంది? మనది అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అంటూ విదేశాల్లో మోదీ గప్పాలు కొడుతూ తన అసమర్థతను ప్రజలపై రుద్దుతున్నారని విమర్శించారు.



# తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా బాధ్యతలు స్వీకరించిన అబ్దేశి సదాలక్ష్మి

## సదాలక్ష్మి కి శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ మహిళా నాయకురాళ్ళు

**రాజేంద్రనగర్,మే21(నమస్తే ఉదయం)**



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా గురువారం బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి ఉడంగడ్డకు చెందిన అబ్దేశి సదాలక్ష్మిని నియోజకవర్గానికి చెందిన మహిళలు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాణిగంజ్ బుద్ధ భవన్ లో గల మహిళా కమిషన్ కార్యాలయంలో కుమారి అబ్దేసి సదాలక్ష్మీ బాధ్యతలు స్వీకరించారు. ఆమెను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్,తో పాటు పలువురు మహిళా నాయకురాళ్లు కలసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.




# తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా బాధ్యతలు స్వీకరించిన అబ్దేశి సదాలక్ష్మి కి శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ మహిళా నాయకురాళ్ళు

**రాజేంద్రనగర్,మే21(నమస్తే ఉదయం )**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలుగా గురువారం బాధ్యతలు స్వీకరించిన రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి ఉడంగడ్డకు చెందిన అబ్దేశి సదాలక్ష్మిని నియోజకవర్గానికి చెందిన మహిళలు కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాణిగంజ్ బుద్ధ భవన్ లో గల మహిళా కమిషన్ కార్యాలయంలో కుమారి అబ్దేసి సదాలక్ష్మీ బాధ్యతలు స్వీకరించారు. ఆమెను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సానెం శ్రీనివాస్ గౌడ్,తో పాటు పలువురు మహిళా నాయకు రాళ్లు కలసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



# స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని మరిచిన రాజేంద్రనగర్ నాయకత్వం..

## రాజేంద్రనగర్ లో కాంగ్రెస్ నాయకులు ఉన్నారా..లేరా.!

## పదవుల కోసం పాకులాడే కాంగ్రెస్ కు అగ్ర నాయకత్వాన్ని విస్మరించారంటూ విమర్శలు

## పార్టీ అధినేత వర్ధంతి గుర్తులేదా.!

**రాజేంద్రనగర్,మే21(నమస్తే ఉదయం)**




భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని రాజేంద్రనగర్ సర్కిల్ కాంగ్రెస్ నాయకులు చర్చనీయాంశంగా మారింది.రాజేంద్రనగర్ సర్కిల్లో ఏడు డివిజన్లో కాంగ్రెస్ నాయకులు వివిధ పదవులు అనుభవిస్తున్నారు.ఇటీవల నామినేటెడ్ పదవులను సైతం పొందారు..అయినా దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తుంది.స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి కాంగ్రెస్ నాయకులకు తెలియదా...తెలిసిన ఎందుకు నిర్వహించాలని మర్చిపోయారా అని పలువురు చర్చించుకుంటున్నారు.కరుడుగట్టిన కాంగ్రెస్ వాదులు...ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు సైతం రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించకపోవడం బాధాకరమని పలువురు విశ్లేషకులు అంటున్నారు.పదవులు,ప్రజా ప్రతినిధులుగా ఎన్నో కాంగ్రెస్ పార్టీ నుండి అనుభవించి పార్టీ దేశాదినేతకు నివాళులు అర్పించకపోవడం విశేషంగా మారింది.

**సాక్షాత్తు కాంగ్రెస్ అగ్రనాయకత్వాన్ని మరిచిన ఎమ్మెల్యే..!**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ నియోజకవర్గం అభివృద్ధి ఎజెండా పేరుతో సీఎం రేవంత్ రెడ్డితో చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నారు.ఈ నేపథ్యంలో స్థానిక ప్రజానికం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ లో ఉండి ఉంటే రాజీవ్ గాంధీ వర్ధంతిని ఎందుకు విస్మరించారంటూ విమర్శలు వినిపిస్తున్నాయి.అసలు రాజీవ్ గాంధీ గురించి గుర్తుందా లేదా అంటూ చురకలు అంటిస్తున్నారు.

## పోషకాహార భద్రత, సుస్థిర వ్యవసాయం, జీవనోపాధిని
# మెరుగుపరచడంలో చిరుధాన్యాల పాత్ర కీలకం

**బుద్వేల్, మే 21 (నమస్తే ఉదయం) :**

పోషకాహర భద్రత, సుస్థిర వ్యవసాయం, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, రైతు వర్గాల జీవనోపాధిని మెరుగుపరచడంలో చిరుధాన్యాలు కీలక బిపాత్ర పోషిస్తాయని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. రాజేంద్రనగర్ లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) లో నిర్మాణంలో ఉన్న గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఆన్ మిల్లెట్స్ (శ్రీ అన్న) భవనాన్ని గురువారం ఆయన సందర్శించారు. చిరుధాన్యాల ఉత్పత్తులు, మార్కెటింగ్, కంపెనీల ప్రతినిధులను ఆయన ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిరుధాన్యాల వినియోగాన్ని విస్తరించడం, ప్రాసెసింగ్, విలువ జోడింపు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, చిరుధాన్యాల ఆధారిత వ్యాపారాలలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, స్టార్టప్లు, మహిళా పారిశ్రామిక వేత్తలు, గ్రామీణ యువతకు మరిన్ని అవకాశాలు కల్పించడం కోసం కృషి చేయాలన్నారు. రైతుల ఆదాయాలను మెరుగుపరచడం, గ్రామీణ ఉ పాధిని కల్పించడం లక్ష్యంగా పరిశోధన, ఆవిష్కరణ, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, పారిశ్రామిక అభివృద్ధి ద్వారా చిరుధాన్యాల ప్రోత్సాహానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చిరుధాన్యాల రంగం యొక్క సమగ్ర అభివృద్ధి కోసం చిరుధాన్యాల పరిశోధన, వ్యవస్థాపకత, రైతు కేంద్రీకృత అభివృద్ధి కార్యక్రమాలను ముం దుకు తీసుకువెళ్లడంలో రాజేంద్రనగర్ లోని జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐఐఎంఆర్) చేస్తున్న కృషి ని కేంద్ర మంత్రి అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సి తారా సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.




రాజేంద్రనగర్ లోని జాతీయ చిరు ధాన్యాల పరిశోధన సంస్థ లో జరుగుతున్న పరిశోధనలను పరిశీలిస్తున్న కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



## ఎమ్మెల్యే రాజకీయ ఉనికి కోసం వీధుల వెంట పర్యటిస్తూ డ్రామాలు చేస్తుండు

**తొంబై% అభివృద్ధి జరిగిందన్నవి కేవలం ప్రగల్భాలే**

**కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుపై కాంగ్రెస్ నేత యుగంధర్ రెడ్డి ఆగ్రహం**

**కూకట్ పల్లి, మే 21 (నమస్తే ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 90% అభివృద్ధి పూర్తయిందంటూ స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేస్తున్న వ్యాఖ్యలు పచ్చి అబద్ధాలని, కేవలం ప్రజల్లో తన ఉనికిని కాపాడుకునేందుకే ఆయన ఆరాటపడుతున్నారని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పర్యటనల పేరుతో ఎమ్మెల్యే అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్నారని మండిపడ్డారు. గురువారం ఆయన మీడియా కి విడుదల చేసిన ఓ ప్రకటన లో మాట్లాడుతూ ఎమ్మెల్యే తీరును, బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను ఘాటుగా విమర్శించారు.

**అభివృద్ధి జరిగితే.. శ్మశానం ఎందుకు మారలేదు?**

నియోజకవర్గంలో 90% అభివృద్ధి జరిగిపోయిందని, ఇంకా పది శాతం మాత్రమే మిగిలి ఉందని ఎమ్మెల్యే కృష్ణారావు ప్రతినిత్యం మైకుల ముందు గొప్పలు చెప్పుకుంటున్నారు. ఎమ్మెల్యే చెప్పే ఆ 90 శాతం అభివృద్ధి చెరబండరాజునగర్ శ్మశాన వాటికలో ఎందుకు జరగలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని యుగంధర్ రెడ్డి నిలదీశారు. అభివృద్ధికి నోచుకోని ఆ శ్మశానవాటిక గురించి ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, బాలానగర్ మాజీ కార్పొరేటర్ మాట్లాడటం అత్యంత హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇన్నాళ్లు అధికారంలో ఉండి చేసిందేమీ లేదని, ఇప్పుడు కేవలం రాజకీయ ఉనికి కోసం వీధుల వెంట పర్యటిస్తూ డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు.

**నివురుగప్పిన నిప్పులా యంత్రాంగం**

నియోజకవర్గంలో అంతా అభివృద్ధి జరిగిపోయిందని స్వయంగా చెబుతున్న ఎమ్మెల్యే మళ్లీ పర్యటనల పేరుతో అధికారులను ఎందుకు వెంట తిప్పుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని యుగంధర్ రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే కృష్ణారావు వ్యవహార శైలి పట్ల అధికారులు ఇప్పటికే తీవ్ర విసుగు చెందారు. కేవలం తన రాజకీయ మనుగడ కోసం వారిని వాడుకోవడం మంచి సంప్రదాయం కాదు. అధికార యంత్రాంగం అంతా ప్రస్తుతం నివురుగప్పిన నిప్పులా ఉంది. ఎమ్మెల్యే వేధింపులు భరించలేక వారు ఏ క్షణంలోనైనా ఆయనపైకి తిరగబడే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం. ఆ తిరుగుబాటు త్వరలోనే జరుగుతుందని ఆయన హెచ్చరించారు.




విద్యార్థులతో మాట్లాడుతున్న సర్పంచ్ వజ్రమ్మ

## పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి: మాచర్ల గ్రామంలో సర్పంచ్ వజ్రమ్మ

**గద్వాల జిల్లా ప్రతినిధి, మే 21(నమస్తే ఉదయం)**

ప్రభుత్వ పాఠశాలలో క్వాలిఫైడ్ టీచర్లు, నాణ్యమైన బోధన జరుగుతోందని అందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను విధిగా ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని మాచర్ల గ్రామ సర్పంచ్ వజ్రమ్మ కోరారు. గురువారం మాచర్ల గ్రామంలో సర్పంచ్ వజ్రమ్మ అధ్యక్షతన గ్రామ పంచాయతీ సమావేశంలోఎజెండా డ్రాపౌట్ ఎన్రోల్మెంట్ , జెండర్ ఈక్వాలిటీ ఽ కేబిఎస్, చైల్డ్ మ్యారేజ్ చర్చించారు. ఈ సందర్భంగా పిల్లలందరిని ప్రైవేటు పాఠశాలకు ఎవరిని పంపకుండగా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు . అదే విధంగా ప్రభుత్వ హైస్కూల్లో ఇంగ్లీష్, తెలుగు మీడియంలో బోధన సాగుతుందన్నారు. బడి బయట లేని గ్రామంగా తీర్చిదిద్దామని బాల్య వివాహాల రహిత గ్రామంగా తీర్చిదిద్దామని గ్రామంలో ఆడపిల్లను మగ పిల్లను సమానంగా చూసే లాగా చైతన్యం తీసుకరావాలని, టెన్త్ క్లాస్ పూర్తయిన పిల్లలందరూ ఇంటర్లో జాయిన్ అయ్యేవిధంగా హాస్టల్ సీట్లు ఇప్పిస్తామని ఆమె అన్నారు. ఆర్ఫన్ సెమీ అర్ఫాన్ పిల్లల గురించి కూడా చర్చించడం జరిగింది జూన్ 12వ తారీకు రోజు స్కూల్ రీఓపెనింగ్ రోజు పండగ వాతావరణం తీసుకురావాలని అదేవిధంగా పీఎం శ్రీ స్కూల్లో సమ్మర్ రెమెడియన్ సెంటర్ సందర్శించి పిల్లలకు కంప్యూటర్ క్లాస్ గేమ్స్, తెలుగు ఇంగ్లీష్ మ్యాచ్ వాలంటరీ ద్వారా నేర్పడంజరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వజ్రమ్మ, వార్డ్ మెంబర్స్ ఎంఈఓ వెంకటేష్, ఎంవీఎఫ్ మండల్ ఇంచార్జ్ కిరణ్ కుమార్, మొబిలైజర్ శృతి పాల్గొన్నారు.



అధికారులు, గ్రామ నాయకులతో సమావేశమైన సర్పంచ్ వజ్రమ్మ

## నవభారత నిర్మాణానికి సాంకేతికతే పునాది అని నమ్మిన విజనరీ లీడర్..
# భారతరత్న రాజీవ్ గాంధీ

**రాజీవ్ కలలుగన్న ఆధునిక, సాంకేతిక, సశక్త భారత నిర్మాణమే మనందరి లక్ష్యం కావాలి**

**పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి, మే 21 (నమస్తే ఉదయం)**




భారతరత్న, స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35 వ వర్ధంతి సందర్భంగా కేపిహెచ్బి కాలనీ రాజీవ్ సర్కిల్ లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఆధునిక భారత సంస్కరణల సృష్టికర్త, మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ అని ప్రపంచం ముంగిట నేడు అగ్రగామిగా దేశం ఉందంటే నాడు విద్య, సాంకేతికత, గ్రామీణాభివృద్ధి, ఆర్థిక సంస్కరణలు దేశ ప్రగతికి మూల స్తంభాలు. ఐటీ రంగానికి పితామహుడుగా, టెలికమ్యూనికేషన్ విప్లవానికి ఆద్యుడుగా, దేశాన్ని 21వ శతాబ్దంలోకి తీసుకెళ్లిన దార్శనికుడిగా రాజీవ్ గాంధీ ది ఎన్నటికీ చెరగని ముద్ర. గ్రామ స్వరాజ్య సాధనకు పునాదులు వేసి, స్థానిక సంస్థల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు, యువతకు 18ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కీలక సంస్కరణలు తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ పాలన ఆచరణీయం. కేంద్రంలో ఉన్న బిజెపి యన్ డీఏ ప్రభుత్వం ప్రజల సంక్షేమం మరచి సంక్షోభంలో నెడుతూ ప్రజల జీవితాలతో ఆడుకుంటుంది. రాజీవ్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ ద్వారా కొనసాగిస్తాం. దేశ ప్రధానిగా రాహుల్ గాంధీనీ గెలిపించుకుంటాం కాంగ్రెస్ పార్టీ ద్వారా శక్తి వంచన లేకుండా కృషి చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలో తీసుకొని వస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోవు రోజుల్లో బీజేపీ ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంటెస్టెడ్ కార్పొరేటర్లు గోపిశెట్టి రాఘవేందర్, గంధం రాజు, డివిజన్ ల అధ్యక్ష్యులు తమ్మినేని ప్రవీణ్, సతీష్ గౌడ్, కృష్ణ రాజ్ పుత్, ఏఎంసీ వైస్ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్, ఫణింద్ర, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, డివిజన్ ల మహిళా అధ్యక్షురాళ్లు రజిత, మారుతీ, పొడుగు అప్పారావు, కనకయ్య, నితీశ్ గౌడ్, వనజ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నమస్తే ఉదయం ఎఫెక్ట్

**ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులను ఆశ్రయించిన కంకర క్రషర్ యాజమాన్యం ... నలుగురు వ్యక్తులపై కేసు నమోదు**

**పటాన్ చెరు,మే 21 (నమస్తే ఉదయం)**




'కప్పం కట్టాల్సిందే" శీర్షికన ఈనెల 18 వ తేదీన నమస్తే ఉదయం పత్రికలో ప్రచురితమైన వార్తకు స్పందన లభించింది. చాలా రోజులుగా పిర్యాదు ఇచ్చేందుకు వెనకడుగు వేసిన వివిధ కంకర క్రషర్ నిర్వహణ సంస్థల యాజమాన్యాలలో ఎట్టకేలకు ఒకరు ధైర్యంగా ఐడిఎ బొల్లారం పోలీసులను ఆశ్రయించారు. బిల్డ్ మేట్ మెటల్ అండ్ సాండ్ ఇండస్ట్రీస్ యజమాని కొందరు వ్యక్తులు బెదిరింపులకు గురి చేస్తూ, డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొంటూ ఐడిఎ బొల్లారం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ నెల 18న ఖాజీపల్లి గ్రామానికి చెందిన అరికెల సురేష్, అరికెల మహేష్, కుమ్మరి జితేందర్, రమేశ్ ఇంకా కొంత మంది కలిసి ఖాజీపల్లి గ్రామ పరిధిలో ఉ న్న తమ క్వారీలో కి అక్రమంగా ప్రవేశించి, అక్కడ పని చేసే వారిని తిట్టి చంపుతామని బెదిరించినట్లు, క్రషర్ యంత్రాలను బలవంతంగా నిలిపివేసినట్లు పిర్యాదు లో పేర్కొన్నారు. అదేవిధంగా ఫోన్ చేసి , తాము ఈ మధ్యనే ఎన్నికైన నాయకులం, మాకు అందరికి ఒక కోటి రూపాయలు ఇవ్వవకపోతే క్వారీ మూసి వేస్తామని బెదిరించారని సంస్థ నిర్వాహకులు వెంకట ప్రసాద్ పిర్యాదు ఇచ్చిన నేపథ్యంలో కేసు నమోదు చేసి పరిశోధన చేస్తున్నట్లు బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా ఇదే తరహాలో బెదిరింపులకు పాల్పడుతున్న మరికొందరు వ్యక్తుల గురించి పోలీసులకు పిర్యాదు చేసేందుకు మరి కొంతమంది పరిశ్రమ నిర్వాహకులు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఇంతకాలంగా బెదిరింపులకు పాల్పడిన వారు ఆయా నిర్వాహకులను పోలీసులను ఆశ్రయించ కుండా బ్రతిమిలాడుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**బెదిరింపులకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదు : బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి**



బొల్లారం పోలీస్ స్టేషన్ పరధిలో గల పరిశ్రమలు, క్వారీ, క్రషర్ ఇతర యాజమాన్యాలను బెదిరింపులకు గురి చేసే వారిపై పిర్యాదు ఇచ్చిన వెంటనే దర్యాప్తు నిర్వహించి బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెదిరింపులకు దిగిన వ్యక్తుల గురించి ఆయా యాజమాన్యాలు ధైర్యంగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

## ఫతేనగర్ డివిజన్‌లో మంచినీటి పైప్‌లైన్ పనులు పరిశీలన

**పనులు వేగంగా పూర్తి చేయాలి: మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**


**కూకట్ పల్లి, మే 21 (నమస్తే ఉదయం)**



కూకట్ పల్లి నియోజకవర్గం, ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శోభనా కాలనీ రోడ్ నెంబర్ 5 లో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన మంచినీటి పైప్‌లైన్ పనులను గురువారం మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ స్థానికులతో కలిసి పరిశీలించారు. గతంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ చేతుల మీదుగా ఈ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన జరిగింది. ప్రజలకు కలుషితం లేని తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారని సతీష్ గౌడ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, శోభనా కాలనీ వాసులకు మంచినీరు, కలుషిత నీరు వస్తుందని స్థానికులు మా దృష్టికి తీసుకొచ్చినందున వారి సమస్యని తీర్చడమే మా లక్ష్యమని అన్నారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం లోపు పనులు పూర్తయితే కాలనీవాసులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో ఫతేనగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి తాము ఎల్లప్పుడూ ముందుంటామని పండాల సతీష్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ నాయకులు రంగ, సుబ్రమణ్యం నాయుడు, కొండల్, సాయి నాథ్ గౌడ్, రాజేష్ కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: అదన కలెక్టర్ కిరణ్మయి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే21(నమస్తే ఉదయం)**



ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22న శు క్రవారం నిర్వహించనున్న జిల్లా స్థాయి కార్యక్రమం ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ కిరణ్మయి గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రజాపాలన కార్యక్రమాలను చక్కగా నిర్వహించడం జరిగిందని, అదే స్ఫూర్తితో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని మరింత అట్టహాసంగా నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల పోటోలు, ఆయా పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాబితాలను, సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించిన నిధుల వివరాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందించేందుకు వీలుగా సమగ్ర వివరాలతో నివేదికలను అందించాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, సాధించిన పురోగతిని సమగ్రంగా ప్రదర్శించేలా నివేదికలు ఉ ండాలన్నారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు సంబంధించి స్టాళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని, శాఖల వారీగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు.